పాఠశాలల వేళల్లో మార్పులు

ఖలీల్‌వాడి, జూలై 20: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వేళల్లో మార్పులు జరిగాయి. ఈ మేరకు శనివారం పాఠశాలల విద్యా డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఇక నుంచి ఉన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15నిమిషాల వరకు నడవనున్నాయి. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉదయం 9 గంటలకు పాఠశాలలు ప్రారంభమవుతాయని జిల్లా విద్యాధికారి ఎన్‌వి.దుర్గాప్రసాద్ తెలిపారు.

బస్సులో చోరీకి పాల్పడిన తల్లీకూతురు

భిక్కనూరు, జూలై 20 : బస్సులో తల్లీకూతురు చోరీకి పాల్పడ్డారని ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్‌కు వెళ్లింది. అక్కడ ప్రయాణికులను ఎక్కించుకొని శుక్రవారం రాత్రి తిరిగి వస్తూ భిక్కనూరు బస్టాండ్‌లో ఆగింది. బస్సు కండక్టర్ రాచర్ల నారాయణ తన ప్యాంట్ వెనుక ప్యాకెట్‌లో పెట్టుకున్న రూ.6,640 నగదు కనిపించలేదు. కూర్చున్న చోట, పక్కన వెతకగా డబ్బులు కనిపించలేవు. బస్సు టోల్‌గేట్ దాటి జంగంపల్లి గ్రామ శివారులో హైవేకు చేరుకోగా డబ్బులు పోయాయని అరిచాడు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు ప్యాసింజర్లు తమ జేబులు చెక్ చేసుకోగా ఒకరివి రూ.3 వేలు, మరొకరివి రూ.5 వేలు పోయాయని చెప్పారు. బాధితులు డయల్ 100కు కాల్ చేయగా భిక్కనూరు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మహిళా పోలీసుల సహాయంతో చెక్ చేస్తుండగా ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా ఒక మహిళ సిరిగారి కవిత నుంచి రూ.9,600, ఆమె తల్లి బొంతల లక్ష్మి వద్ద రూ.5,500 నగదు లభించింది. ఆ డబ్బులను తామే దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా.. వారు హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ వాసులని, కొన్ని రోజులుగా కామారెడ్డి వచ్చి ఓ ఇంటిని అద్దెకు తీసుకొని చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, జూలై 20: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద కొనసాగుతున్నది. శనివారం మధ్యాహ్నం 3గంటలకు 18,276క్యూసెక్కుల వరద ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరింది. ప్రాజెక్ట్ నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు)కాగా, శనివారం మధ్యాహ్నం వరకు 1066.60 అడుగులు (18.131 టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి అవుట్‌ఫ్లో 489క్యూసెక్కులు కొనసాగుతున్నది. సరస్వతీ కాలువకు 10, మిషన్ భగీరథకు 231, 248 క్యూసెక్కుల నీరు ఎండవేడికి ఆవిరవుతున్నట్లు అధికారులు తెలిపారు.

కేజ్‌వీల్ కిందపడి రైతు మృతి

దేవ్లా (ఫైల్)

రాజంపేట్, జూలై 20 : మండలంలోని షేర్ శంకర్ తండాకు చెందిన రమావత్ దేవ్లా (61) ట్రాక్టర్ కేజ్‌వీల్ కిందపడి మృతి చెందాడని ఎస్సై సంపత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. షేర్ శంకర్ తండాకు చెందిన రమావత్ దేవ్లా శనివారం ఉదయం 11 గంటలకు తన పొలంలో గేట్‌వాల్ తిప్పుతున్నాడు. అదే గ్రామానికి చెందిన వ్యక్తి కేజ్‌వీల్ ట్రాక్టర్‌తో పొలంలో పని చేస్తూ అజాగ్రత్తగా వెనక్కి నడపడంతో రమావత్ దేవ్లా తలకు దెబ్బ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. మృతుడి కుమారుడు రమావత్ సేవియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జోరువాన

- రెండు రోజులుగా ముసురేసిన వర్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఖలీల్‌వాడి, జూలై 20 : వర్షాకాలం ప్రారంభమై చాలా రోజులు కావస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా జోరు వర్షం కురుస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని రోడ్లు జలమయమయ్యాయి. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. శనివారం రాత్రి 9 గంటల వరకు రాష్ట్రంలోనే అత్యధికంగా ముప్కాల్ మండలం వేంపల్లిలో 13.28 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే ముప్కాల్‌లో 7.85, కమ్మర్‌పల్లిలో 7.38, బాల్కొండలో 7.33 సెం.మీటర్ల వర్షం కురిసింది. మెండోరా, మోర్తాడ్, ఆలూర్‌లలో 6 సెం.మీటర్లకు పైగా, రెంజల్‌లో 5.7, నవీపేట్‌లో 5.5, ఏర్గట్లలో 5.3, వేల్పూర్‌లో 5.0, పాల్దాలో 4.9, జక్రాన్‌పల్లిలో 3.8, నిజామాబాద్ నార్త్, గూపన్‌పల్లిలో 3.0, ఎడపల్లి, మంచిప్ప, నందిపేట్, కోటగిరి, నిజామాబాద్ రూరల్, వర్ని, సిరికొండ, ఇందల్వాయి, డిచ్‌పల్లి, ధర్పల్లి, రుద్రూర్‌లో 2 సెం.మీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది.

కామారెడ్డి జిల్లాలో బీర్కూర్ మండలంతోపాటు మద్నూర్ మండలం సోమూర్‌లో అత్యధికంగా 2.5 సెం.మీ, ఎల్లారెడ్డిలో 2.4, నస్రుల్లాబాద్, పిట్లం, గాంధారి, జుక్కల్‌లో 2.3, బాన్సువాడ, డోంగ్లీ, మద్నూర్‌లో 2.2, నిజాంసాగర్, రాజంపేట్, భిక్కనూరు, కామారెడ్డి, లింగంపేట, తాడ్వాయిలో 1.5 సెం.మీటర్లకు పైగా వర్షపాతం కురిసినట్లు అధికారులు తెలిపారు.

నిజామాబాద్‌లో కురుస్తున్న వర్షం

అన్నదాతల్లో సంతోషం..

బోధన్ రూరల్/మాక్లూర్/ ఇందల్వాయి, జూలై 20: జిల్లాలోని బోధన్, మాక్లూర్ మండలాల్లో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. వర్షాలు వ్యవసాయ పనులకు మేలు చేయనుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలువురు రైతులు వరినాట్లు వేయడాన్ని ముమ్మరం చేశారు. ఇందల్వాయి మండలకేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి చెరువులోకి వర్షపు నీరు చేరుతున్నది. ఒర్రెలు నిండుగా ప్రవహిస్తున్నాయి.

మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది తప్పకుండా విధుల్లో ఉండాలి

- ఆదేశాలు జారీ చేసిన మున్సిపల్ కమిషనర్ మకరంద్

కంఠేశ్వర్, జూలై 20 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లలో రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులు తప్పకుండా విధుల్లో ఉండాలని మున్సిపల్ కమిషనర్ మకరంద్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్కిల్ వారీగా ఇంజినీరింగ్ విభాగం కమిటీని నియమించనున్నట్లు పేర్కొన్నారు. 60 డివిజన్లకు కమిటీ అధికారులుగా అడిషనల్ కమిషనర్ శంకర్, డిప్యూటీ కమిషనర్ రాజేందర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీమోహన్‌రెడ్డి, సూపరింటెండెంట్ జనార్దన్, నరేందర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. కమిటీ అధికారులు ఈనెల 22 నుంచి ప్రతిసర్కిల్‌లో రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికుల భౌతికస్థితిని ధ్రువీకరిస్తూ, హాజరుపట్టికను సేకరించాలని సూచించారు. ఏదైనా సర్కిల్‌లో హాజరు కాకపోతే సంబంధిత ఇంజినీర్లకు మెమోలు జారీ చేయాలని, రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల ఫిజికల్ పొజిషన్‌ను 10 రోజుల్లోగా పూర్తి నివేదికను అందజేయాలని ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

నిజామాబాద్ నగరంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మకరంద్

కంఠేశ్వర్, జూలై 20 : నగరంలో శనివారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నాలాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. నగర మున్సిపల్ కమిషనర్ మకరంద్ జిల్లాకేంద్రంలో పర్యటించి, పలు ప్రాంతాలను పరిశీలించారు. అర్సపల్లి, మాలపల్లి ఏరియాల్లో ఉన్న నాలాలను పరిశీలించి, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అత్యవసర సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం బాబాన్‌సాబ్ పహాడ్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి, అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

కొనసాగుతున్న గుత్ప, అలీసాగర్ కార్మికుల సమ్మె

ఫకీరాబాద్ చౌరస్తా వద్ద సమ్మెలో పాల్గొన్న గుత్ప అలీసాగర్ లిఫ్టు కార్మికులు

నవీపేట, జూలై 20: బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గుత్ప అలీసాగర్ లిఫ్టు ఇరిగేషన్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. మండలంలోని ఫకీరాబాద్ చౌరస్తాలో లిఫ్టు కార్మికులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ నాయకుడు గణేశ్ మాట్లాడుతూ ఐదు నెలల నుంచి వేతనాలు అందక భార్య పిల్లలతో పాటు పస్తులు ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ లేదా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని వేతనాలు ఇప్పించాలని కోరారు.బకాయిలు చెల్లించే వరకూ సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. సమ్మెలో కార్మికులు గణేశ్, సందీప్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండోమెంట్ సహాయ కమిషనర్ బదిలీ?

సుభాష్‌నగర్, జూలై 20 : జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుప్రియ బదిలీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. డిసెంబర్ 22, 2022 సహాయ కమిషనర్‌గా సోమయ్య గుండెపోటుతో చెందడంతో కరీంనగర్ జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న సుప్రియ ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగుతున్నారు. నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతీ ఆలయ ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న విజయ్‌రామారావు జిల్లా ఎండోమెంట్ కమిషనర్‌గా బదిలీపై వస్తున్నట్లు దేవాదాయశాఖ వర్గాలు తెలిపాయి. సహాయ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సుప్రియ దేవాదాయ భూములు ఆక్రమణకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటించడానికి బయోమెట్రిక్ విధానాన్ని అమలుచేశారు. అర్హత కలిగిన ధూపదీప నైవేద్య పథకం అర్చకులకు గుర్తింపుకార్డులు ఇవ్వడంతోపాటు పలు అంశాల్లో శిక్షణ తరగతులను ఏర్పాటు చేసి అర్చక ఉద్యోగుల ప్రశంసలు పొందారు.

అగ్నిమాపక శాఖలో బదిలీలు

- డీఎఫ్‌వో, ఏడీఎఫ్‌వో ట్రాన్స్‌ఫర్

వినాయక్‌నగర్, జూలై 20 : అగ్నిమాపక శాఖలో బదిలీలు నిర్వహించినట్లు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆదేశాలు జారీ చేసినట్లు ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉత్తర్వులు వెల్లడించారు. ఆరు సంవత్సరాలకుపైగా నిజామాబాద్ జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా కొనసాగిన మురళీ మనోహర్‌రెడ్డిని హైదరాబాద్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా మాదాపూర్‌లోని ఫ్రంటో స్కైలిఫ్ట్‌కు బదిలీ చేశారు. మెదక్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న వై. గౌతంను నిజామాబాద్ జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా నియమించారు. సదరు అధికారి గతంలో రెండుసార్లు నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న భానూప్రతాప్‌ను రాష్ట్ర హైకోర్టులోని ఫైర్ విభాగానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆయన స్థానంలో కూకట్‌పల్లి ఫైర్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సైదులును నియమించారు.

తప్పుడు డాక్యుమెంట్లతో ప్లాట్ రిజిస్ట్రేషన్

- ఇద్దరి అరెస్ట్

కామారెడ్డి రూరల్, జూలై 20 : కామారెడ్డి పట్టణంలో ఓ స్థలం విషయంలో తప్పుడు డాక్యుమెంట్లు తయారు చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డిలోని గాంధీనగర్‌లో ఉన్న 200 గజాల ప్లాటును కలిమెళ్ల రాజయ్య 2002లో కొనుగోలు చేశాడు. ఆ తర్వాత అతను అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే 2015లో వీక్లీ మార్కెట్‌కు చెందిన మారం శ్రీనివాస్ ఆ ప్లాట్‌పై కన్నేశాడు. ఎలాగైనా ఆ ప్లాట్‌ను సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో ఆ ప్లాట్ యజమాని రాజయ్యకు కుమారుడు కలిమెళ్ల మహేందర్ ఉన్నట్లు తెలుసుకున్నాడు. ఎవరికీ తెలియకుండా వీక్లీ మార్కెట్‌కు చెందిన ఆరేటి గంగాధర్ అనే వ్యక్తిని మహేందర్‌లా చూపించి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించాడు. అసలు యజమాని మహేందర్ స్థానంలో ఆరేటి గంగాధర్‌ను సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు తీసుకెళ్లి ఆ ప్లాట్‌ను మారం శ్రీనివాస్ తన పేరుమీదికి మార్చిడి చేయించుకున్నాడు. తర్వాత ఆ ప్లాట్‌ను కామారెడ్డి పట్టణానికి చెందిన మరో వ్యక్తికి విక్రయించాడు. ఈ విషయం తెలియని కలిమెళ్ల మహేందర్ తన తండ్రి కొనుగోలు చేసిన ప్లాటు వద్దకు వచ్చి చూడగా అది వేరే వారి స్వాధీనంలో ఉండడాన్ని గమనించి, వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, బాధ్యులైన మారం శ్రీనివాస్, ఆరేటి గంగాధర్‌ను అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. తప్పుడు డాక్యుమెంట్లు తయారు చేసి ప్లాట్లు, స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాణిజ్య

అబ్దుల్ కలామ్ టెక్నికల్ వర్సిటీ ప్రతినిధులతో టీ హబ్‌వర్గాలు

టీ హబ్‌తో అబ్దుల్ కలామ్ వర్సిటీ జట్టు!

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 20 (నమస్తే తెలంగాణ): టీ హబ్‌తో కలిసి పనిచేసేందుకుగాను ఉత్తరప్రదేశ్‌కు చెందిన డాక్టర్ అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం ముందుకొచ్చింది. రెండు రోజులపాటు టీ హబ్ కార్యకలాపాలను పరిశీలించిన ప్రతినిధుల బృందం శనివారం..అక్కడ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు టీ హబ్‌తో కలిసి పనిచేయనున్నట్లు అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధులు ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరాలకు అనుగుణంగా రూపొందించడంలో టీ హబ్ దూసుకుపోతున్నదని, తమ యూనివర్సిటీలో ఆవిష్కరణలను ప్రోత్సహించేలా త్వరలో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ప్రైవేట్ రంగంలోని కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు కూడా తమతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని టీ హబ్ ప్రతినిధి వెల్లడించారు. స్టార్టప్‌లకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు టీ హబ్ ద్వారా లభిస్తున్నాయని..అలాగే దేశ, విదేశాలకు చెందిన పలు సంస్థలు సందర్శించడంతో పాటు కలిసి పనిచేసేందుకు వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకుంటున్నాయని తెలిపారు.

పీఎస్‌యూలకు ముప్పుతప్పినట్టేనా?

ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గనున్న ఎన్డీఏ సర్కారు

రాష్ట్రంలోని ఆరు ప్రభుత్వ సంస్థలకు కొత్త ఆశలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా వదిలించుకోవాలని చూస్తున్న నరేంద్ర మోదీ సర్కార్ ఈసారికి కాస్త వెనుకడుగు వేసే అవకాశాలున్నాయి. పూర్తిస్థాయిలో మెజార్టీ రాకపోవడం, మరోవైపు ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పీఎస్‌యూల ప్రైవేటీకరణపై మోదీ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణపై అత్యంత దూకుడుగా వ్యవహరించింది. ఫలితంగా దేశవ్యాప్తంగా 35 పీఎస్‌యూలు ప్రైవేటుపరం అయ్యాయి. మారిన రాజకీయ పరిణామాలతో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగలడంతో సంకీర్ణ సర్కారు తమ ప్రాధాన్యతలను మార్చుకున్నట్లు తెలుస్తున్నది. ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాలు ప్రైవేటీకరణకు ఒప్పుకునే అవకాశాలు లేకపోవడంతో మోదీ సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో ప్రైవేటీకరణకు మొగ్గుచూపకుండా..కేవలం వాటాని పునరుద్ధరించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించి ఇటీవల పలువురు కేంద్ర మంత్రుల వ్యాఖ్యలు కూడా ఇందుకు బలంచేకూరుతున్నది. దీంట్లోభాగంగా రాష్ట్రంలో ఉన్న ఆరు ప్రభుత్వరంగ సంస్థలకు ఉపశమనం లభించే అవకాశాలున్నాయి.

రాష్ట్రంలో ప్రైవేటీకరణకు ప్రతిపాదిత సీపీఎస్‌యులు, వాటి ఆధీనంలోని భూములు(ఎకరాల్లో)..

1. హిందుస్థాన్ కేబుల్స్ లిమిటెడ్(హెసీఎల్)	–	324.87
2. హిందుస్థాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్	–	126.32
3. ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్(ఐడీపీఎల్)	–	551.03
4. హెచ్‌ఎంటీ వాచెస్	–	888.05
5. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సీసీఐ)	–	2,272.85
6. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ	–	3,020
	మొత్తం -	7,183.12 ఎకరాలు

మూతపడిన 10 సంస్థలు..

రాష్ట్రవ్యాప్తంగా పది ప్రభుత్వరంగ సంస్థలు మూతపడ్డాయి. ఒకానొక దశలో 27 సంస్థలు ఇక్కడ కార్యకలాపాలను కొనసాగించగా, ఆర్థిక ఇబ్బందులు, నిధులు కేటాయింపులు లేకపోవడంతో పది సంస్థలు మూతపడ్డాయి. దీంతో వీటి సంఖ్య 17కి పరిమితమయ్యాయి. ఈ మూతపడిన పది సంస్థల్లో ఆరింటిని పూర్తిగా వదిలించుకోవాలని కేంద్ర సర్కార్ గతంలోనే ఎత్తుగడ వేసింది. కానీ కేసీఆర్ సర్కార్ తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గింది. అయితే నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ఉన్న కంపెనీల భూములను విక్రయించాలంటే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలుపాల్సి వుంటుంది. ఈ క్రమంలోనే ఆరు సీపీఎస్‌యూల ప్రైవేటీకరణకు ఆమోదం తెలుపాలని రాష్ట్ర సర్కార్‌పై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చింది.

హెచ్‌ఎంటీ తెరుచుకునేనా..

ఒకప్పుడు దేశానికి సమయం చూపించిన హెచ్‌ఎంటీ ప్రస్తుత ఆర్థిక సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నది. పీఎస్‌యూలను పట్టించుకోకుండా ప్రైవేట్ రంగ సంస్థలనే ప్రోత్సహిస్తున్న కేంద్ర సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో ఎన్నో సంస్థలు మూతపడ్డాయి. వీటిలో దేశానికి సమయం చూపించిన హెచ్ ఎంటీ కూడా ఉన్నది. ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగించిన ఈ సంస్థ తయారు చేసిన గడియారాలే ఎక్కువగా అమ్ముడయ్యాయి. ఆ తర్వాతి క్రమంలో ప్రైవేట్ రంగ సంస్థలనుంచి పోటీ పెరగడం, నిధులు కేటాయింపులు తగ్గిపోవడంతో ఉత్పత్తిని నిలిపివేసింది. దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఇటీవల కాలంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామి రాష్ట్ర పర్యటన సందర్భంగా హెచ్‌ఎంటీ ప్లాంట్‌ను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద మంత్రితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హెచ్‌ఎంటీని పునరుద్ధరించి తమ ఉద్యోగాలు కాపాడాలని, తమకు రావాల్సిన ప్రయోజనాలను అందించాలని కోరారు. దీనిపై కుమార స్వామి సానుకూలంగా స్పందించారు. హెచ్ ఎంటీ పునరుద్ధరించడంతోపాటు ఆక్రమణకు గురవుతున్న హెచ్‌ఎంటీ భూములను కాపాడుతామని ఆయన హామీ ఇచ్చారు.

ఎల్ఐసీ దూకుడు

74 శాతం రిటర్న్ను పంచిన సంస్థ

న్యూఢిల్లీ, జూలై 20: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ మళ్లీ తన పూర్వవైభావాన్ని సంతరించుకుంటున్నది. స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన మొదట్లో భారీగా పతనమైన కంపెనీ షేరు తిరిగి నేలకు కొట్టిన బంతిలా దూసుకుపోతున్నది. గడిచిన ఏడాదికాలంలో అత్యధికంగా రిటర్నులు పంచిన షేరు ఎల్ఐసీదే కావడం విశేషం. దేశీయ టాప్-10 దిగ్గజ సంస్థల్లో ఎల్ఐసీ షేరు 74 శాతం రిటర్నులు పంచింది. దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ 68 శాతం రిటర్నులు పంచగా..బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) 47.64 శాతం రిటర్నులు పంచింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల వద్ద ఉన్న సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. దేశీయ అత్యంత విలువైన రిలయన్స్ ఇండస్ట్రీస్ కేవలం 10 శాతం మాత్రమే మార్కెట్ విలువ పెరగగా.. ఐసీఐసీఐ బ్యాంక్ 28 శాతం, టీసీఎస్ 25 శాతం, ఇన్ఫోసిస్ 22 శాతం చొప్పున బలపడ్డాయి.

గతేడాదికాలంలో సంస్థల షేర్ల పెరుగుదల రూపాయల్లో..

కంపెనీ	19 జూలై 19 2023 నాటికి	నాటికి జూలై 2024	తేడా (శాతంలో)
ఎల్ఐసీ	620.4	1,080.1	74.10
భారతీ ఎయిర్‌టెల్	869.8	1463	68.20
ఎస్బీఐ	601.35	887.85	47.64
ఐసీఐసీఐ బ్యాంక్	973.65	1248.15	28.19
టీసీఎస్	3,471	4,330.25	24.76
ఇన్ఫోసిస్	1,474.35	1,807.7	22.61
రిలయన్స్	2,840	3,138.35	10.51
హెచ్‌యూఎల్	2,671.75	2,725	1.99
ఐటీసీ	478.85	475.05	-0.79
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,684.85	1,613.9	-4.21

'బిల్డర్లకు రాయితీలివ్వండి'

వచ్చే బడ్జెట్‌పై క్రెడాయ్

న్యూఢిల్లీ, జూలై 20: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న సార్వత్రిక బడ్జెట్‌లో గృహ కొనుగోలుదారులకు, తక్కువ ధరతో ఇండ్లను నిర్మించే బిల్డర్లకు మరిన్ని పన్ను ప్రయోజనాలు కల్పించాలని రియల్టీ బాడీ క్రెడాయ్ కోరుతున్నది. రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ గాడినపడాలంటే కేంద్ర ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహక నిర్ణయాలు తీసుకోవాలని, ముఖ్యంగా పన్ను రాయితీలు కల్పించినప్పుడే ఈ రంగ సంస్థలు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే అవకాశాలున్నాయని పేర్కొంది. కొత్తగా గృహాలు కొనుగోలుచేసేవారికి వడ్డీ రాయితీని పెంచాలని, అలాగే మళ్లీ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీంను ప్రవేశపెట్టాలని, అప్పుడే చౌక ధర కలిగిన గృహాలకు డిమాండ్ ఉంటుందని క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ తెలిపారు. ప్రస్తుతం రూ.2 లక్షలుగా ఉన్న డిడెక్షన్‌ను రూ.5 లక్షలకు పెంచాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరుతున్నట్లు చెప్పారు.

బడ్జెట్ (2024-25)

నిరాశపరిచిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

క్యూ1లో రూ.16,474 కోట్ల లాభం

ముంబై, జూలై 20: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిరాశజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,474 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త